# పంచచామరపన్నములు

(1847)

(సి.ఎల్.ఎస్. వారు 1953లో ముద్రించినది.)

1. కరంబు లెత్తి మౌళివంచి కన్నుదోయి మూసి నీ
వరాంఘ్రులాత్మలో దలంచి వందనంబు లెక్కుడా
చరింతు నన్ను గావుమయ్య సత్కృపాంత రంగివై
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

2. దురంత దుష్కృతాంధకార దుఃఖవార్ధి మగ్నులై
మరేమి దిక్కులేని దీన మానవాళినెల్ల ను
ద్ధరింప దేవునాజ్ఞ బూని ధాత్రి నవతరించితో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

3. నిరంతరాంతరంగ భక్తి నిష్ఠ నా కొసంగి సం
గరంబునేర్పి యా పిశాచి గర్వ మూడగొట్టి నీ
దరిన్ దిరంబుగా మదాత్మ దాఁచి బ్రోచుమో ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

4. దురాశ పాశబద్ధుడైన దుర్నరుండ పాప సా
గరంబులోన మున్గి యొడ్డు గానలేని నన్ను స
త్వరంబుగా భవద్దయా తరిన్ భరించి బ్రోవవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

5. బిరాన నా మొరాలకించు బీద దాసిగానిపై
సరే పరాకు చిత్తగించి జాగుసేయ నీ కృపా
తరంగ వాక్సుధాబ్ధి ముంచి తాపమార్పిగావవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

6. పరీక్షజేసి బ్రోతునంటివా మదీయమైన యీ
శరీర మాత్మలోన బైట సర్వపాపలోపమే
యెరుంగవచ్చుగాని శౌచమేమి గానరాదయా
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

7. కరీంద్ర మంకుశంబుచేతగాక ద్రిప్పగూడునే
తిరంబొకింతలేని నా మతిన్ భవత్కృపా యపాం
గ రజ్జులన్ గుదించి నీవు గట్టకున్న నిల్చునే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

8. భరింపరాని ఘోర పాప భారమెల్ల ద్రుంచి నీ
కురంగటన్ మదాంతరాత్మకుం బ్రశాంత మిమ్ము ని
ష్ఠురంబు గట్టుకొండువేల జూడు నేడు నీదయన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

9. ఎరింగెరుంగరాని రీతి నిట్టు లూరకుండుట
ల్సరే యిదేమి దూరదేశిలాగు నన్ను జూతువీ
దరిద్రుచోట పంతమేల దాపుజేర్చ రాగదే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

10. చిరాకు బొందితేని యింక జెప్పుకొందు నేరితో
కరుంగదయ్య నీ మనంబు గాలిలోని దీపమై
తిరంబులేని నన్ను బట్టి దిట్ట దీర్చి గావవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

11. అరణ్య రోదనంబు పోలికయ్యె నస్మదీయ శో
క రావ మాలకించరావు కారణంబదేమొ కో
భరంబు దోఁచెనో క్షమా స్వభావ మెందుదాఁగెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

12. నిరాశ యెన్నడైన గల్గనేరదయ్యనీవు నన్
గురించి తొల్లి యెత్తి పెంచుకొన్న ప్రేమ జూచినన్
దిరంబు నిబ్బరంబు నాకు దిట్టమై గనంబడున్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

13. సిరుల్మెరుంగు దీగెలట్లు శీఘ్రకాలముం జనున్
శరీర మంబు బుద్బుదంబు చంద మందముం జెడున్
తిరంబుగాని మర్త్యుడేల తీవ్రలోభ మణ్చడో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

14. నిరాపరాధివైన నిన్ను నిర్దయాత్ములక్కటా
విరోధి యూద సైనికుల్ భవిష్యదుక్తు లొప్పగా
యెరూసలేము బైట చాల హింసబెట్టి చంపిరో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

15. అరాతులయినవారు నిన్నలక్ష్యపెట్టిగొట్టుట
ల్సరే యెరింగెరింగి ప్రేమ సల్పు నేను నీకు ము
ష్కరుండనై రహస్య బాధ చాలబెట్టి నానయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

16. కరుంగదేమి సేతు నెంత గట్టి గుండె నాదకో
కురీతియైన పాపవహ్ని కొంగుమూట గట్టినా
శిరంబు కెత్తుకోను చింతచేసి నాడ నయ్యయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

17. మరింత బాధపైని బాధ మానబారు పుంటిపై
కరాసి దూసిపోవునట్లుగా మదీయ పూర్వ దు
స్తరాపదాబ్ధి యొద్దు జేర దావవహ్ని జుట్టెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

18. నిరూఢ సత్యవేదసార నీతి దివ్య వాక్య మా
ధురీ రసంబుగ్రోలు జిహ్వతోను జెప్పుదున్ సరే
దురుక్తులాడి యిట్టి పెక్కు దుఃఖ మిస్తి వందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

19. శరీరవేష భాష లింక చాలు వీడు మం
తరింద్రియంబు నీవు యేసు తత్వబోధ గాంచి క్రీ
స్తు రూపులోన బూని బుద్ధి శుద్ధినుండు మందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

20. తిరంబుగా యెహూవ కన్ను దిక్కు కన్ను లుంచకన్
పొరల్ ధరించి పోతరించి బుద్ధిమాలి యొక్క మం
టి రూపు నాసచేసి నే గణించినాడ పాపమో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

21. నిరంతరంబు నా మొగంబు నేలతట్టువంచి నా
కరంబుచేత రొమ్ముగొట్టి కంట నీరు జారగా
నిరుత్తరుండనై యొకప్టు నేరమెంచుకొందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

22. సరాళ మార్గమందు చిత్తశాంతి నేఁగి యేఁగి య
ద్దరిం బిరాలనొక్క పొల్పుదారి గాంచి పోవు ము
ష్కరుండువోలె నేను చెడ్డ జాడ గూడ బోతినో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

23. హరించు పాపమెల్ల నీ మహా పవిత్ర రక్తబిం
దు రాశిలోన నొక్క చుక్కతోగదా యిదేమదిన్
నిరంతరంబు నమ్మినాడ నీవె సాక్షివిందుకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

24. ధరిత్రిలోన మృత్యు దేహ ధారి జూచునంచెదన్
కరంబు భీతిగల్గు పాప కర్మమందు నీవు చూ
డరాని కార్యమేది నీ యెడన్ అలక్ష్యమేలకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

25. పరేశుడైన తండ్రియొద్ద భక్తిలేని ద్రోహినై
చరించినాడ నంతరంగ సాక్షికిన్విరోధ మా
చరించినాడ నింక నీకు చాల దుఃఖమిచ్చితో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

26. విరక్తిబొందకయ్య నా వివేక హీనకార్యముల్
పొరింబొరిం దలంచకయ్య బుద్ధిశుద్ధిలేని దు
ర్నరుండటంచు నన్ను వీడనాడకయ్య మ్రొక్కెదన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

27. భరింపరాని దుఃఖరాసి పాలు ముందుపొందుటల్
యెరింగెరింగి యింక నా దురిచ్ఛకేగవచ్చునే
పరాకు నా కిదేమి యెంత పాపజన్మినయ్యయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

28. నరుండ మంటిలోన బుట్టినాడ నా స్వభావమున్
ఎరింగియుంటి వీవు మంటికేది మంచి తెల్వి యీ
దరిద్రు దీను దుర్బలాత్ము తప్పుదిద్ది బ్రోవవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

29. మరల్చి పాపబుద్ధి దుఃఖవార్ధి యింకజేసి యు
ద్ధరించి తొల్లి నన్ను నెత్తి దాపుజేర్చినావు ని
న్నెరుంగుదు న్మదీయ భారమింక నీదెకాదె యో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

30. తరతరాల నాటి తాత తండ్రులైనవారికే
మెరుంగరాని నీ సువార్త నిచ్చినావు నాకు ధూ
ళి రేణువైన నేను నీదు లెక్కలోకి వచ్చితిన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

31. కరంబుపై కరంబుగొట్టి కన్ను మూయునంతలో
ధరిత్రి మండలంబు మేర దాఁటిపోవు నామదిన్
తిరంబు జేయకున్న నీకు తీరుబాటు నియ్యనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

32. దురంబు చేసిచేసి వీఁగి దొర్లిపడ్డవేళ నా
తెరంగు జూచి నీవదేల తేరకానిలాగు బ్రో
వరాక యూరకున్న నిందువల్ల నిందరాదకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

33. చిరాయు వచ్చి సర్వధాత్రి సీమనేల గల్గినన్
సిరుల్ సమృద్ధినుండి నీదు సేవలేకయున్న దు
స్తరంపు నారకాబ్ధి యొడ్డు దాపునున్నయట్లగున్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

34. గురుప్రబోధ నేను మున్నుగోరి తాడులేని బొం
గరంబు రీతి ద్రిమ్మరైతిగాని వెజ్జువేలు పా
క్కరుణ్నినైన పాపహీను గాననైతి నెచ్చటన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

35. షఃరేల జాలమింకసేయ మంచిదా సదా మదం
తరాత్మలోని యంగలార్పుతావు నీవు చూడవా
బిరాన రాగదయ్య వచ్చి పెంచుమయ్య నీ దయన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

36. ఎరుంగరాదు నీ మహత్వమెంత గ్రుడ్డులోని పి
ల్ల రీతినున్న పైకిలాగి కన్నువిప్పి యా
త్మ రక్షణార్థమైన మంచి దారిజూపి నావయా
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

37. చరిత్రలెన్ని లేవు వెర్రిశాస్త్ర దైవముల్పరం
పరాభివృద్ధి గావె శుద్ధభక్తి యుక్తి ముక్తి నీ
వరాంఘ్రులిచ్చుగాక వేరె వార్తలన్ని వట్టివో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

38. విరోధినాకు లేడొకండు విశ్వమందు నెందునన్
పరీక్షజేసినాను దుస్స్వభావమొక్కటే మదాం
తరాత్మలోని దుర్విరోధి దాని ద్రుంచవే ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

39. గురుండు తల్లితండ్రి యేలుకొన్నరాజు దాతయున్
నిరంతరోపకారి నాకు నీవె కావె యింక న
న్నెరుంగువార లెవ్వరయ్య యిష్టసిద్ధిజేయనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

40. పరున్నవేళ నాదు పాన్పు పజ్జకేఁగుదెంచినన్
పరామరించి నీ ప్రతిజ్ఞవాక్యముల్ మదాత్మకున్
స్మరింపజేసి ధైర్యపర్చి శాంతినిద్ర నిత్తువో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

41. ధరిత్రియెల్ల గూర్చి యొక్క తట్టు నన్ను నొక్క చో
తరాజునుంచి తూతువేని ధాత్రి చుల్కనౌను నే
భరంబునౌదు నెందుకన్న పాపినవుటవల్లనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

42. పురాతన స్వభావ వృక్షమూల మూడదీసి నీ
కరాసిచేత తున్కతున్కగానొనర్చి ప్రేమ వ
హ్ని రాఁజబెట్టి గాల్చిపుచ్చి నెమ్మదియ్యవే ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

43. స్మరించి నా మనంబులోన చర్చసేయనెంత య
బ్బురంబు సిగ్గుగానుపించు ముల్లుదీసి కొయ్య గు
చ్చురీతి నయ్యెగాక నా యశుద్ధబుద్ధి కార్యమో
నరావతారాధారి యేసునాథ దీనరక్షకా

44. చురుక్కునన్ మనంబులోన చూడినట్లగుం గదా
దురంత పాప వహ్నిచేత తొల్లి కాలియున్న మ
చ్చ రేపినాడనయ్యొ నా విచార మేడబోయెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

45. పరుండొకండు గోతబడ్డ వాని నెత్తబోయి త
త్తరంబుచేత నూతిలోన దానె బడ్డ రీతి నా
చరిత్రమయ్యె నింక చెప్ప జాలినంత యున్నదో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

46. తరింతు పాతకాబ్ధి స్వంత దండుతో పిశాచి సం
గరంబు సేయవచ్చెనేని గర్వమూడ్తువాని నీ
దరిద్రుపై భవత్కృపా సుధాసుధార బోసినన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

47. నిరంజనుండు నిర్వికారి నిర్మలాత్ముడున్ పరా
పరుండనంత దివ్య శక్తివంతుడైన తండ్రి స్వ
స్వరూపివైన నీవు మానుష స్వరూపమైతివో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

48. నరాధమాధమాళిలోన నాయకుండనేను సూ
కరంబు కుర్కురంబు సాటిగా నొనర్చినాడ నా
దురాత్ము కావు కావు మంచు దోసిలొగ్గితో ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

49. దరిన్ మదాత్మ దాఁచి బ్రోచి ధైర్యమిచ్చితయ్య క
న్కరించు మింక తక్కియున్న కాలమెల్ల వెల్గులో
చరించునట్ల నన్ను కాలు జారకుండ జేయుమో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

50. స్ఫురద్ధ్రువత్కృపా బలంబు పుచ్చుకొంచు నే నికన్
ధరిత్రిలో జరించు జీవితంపు కాలమెల్ల సు
స్థిరంబుగా త్వదీయ సేవ జేయునట్లు సేయవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా

క॥ మనసానందము క్రైస్తవ
జన యనుభవసార పంచ చామరపన్నం
బనుకూల మతిని జదువు సు
జనులకు ప్రభు క్రీస్తుదాత్మ సౌఖ్యము లిచ్చున్

# పంచరత్నములు

## అయిదు సీసపద్యములు

(1847)

(సి.ఎల్.ఎస్.వారు 1946లో ముద్రించినది.)

ఎ. ఎవ్వడు తనజేన నిమిడించి కొలుచు నీ
యాకాశ మండలం బద్భుతముగ,
నెవ్వడీ పుడమి మన్నెల్లను తన కుంచ
మునకు లోబడజేయు ఘనబలమున,
యెవ్వడీ మహిత మహీధరంబుల బట్టి
తన తరాజున నుంచి యొనర దూంచు,
నెవ్వడీ జలధులం దిముడు నీరములన్ని
తన చేతి పుడిసెలో నునిచి కొలుచు,

తే॥గీ॥ వసుధగల సర్వజీవాళి నిసుక కన్న
సన్నముగ జూచి త్రాసులో నరగ నునుచు,
నెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

2. ఎవ్వని చేతిలో నీ విశ్వమంతయు
నాటల పూబంతి యట్టులుండు,
నెవ్వని కాంతియం దీసూర్యచంద్రులు
మెరుగుడు పురుగుల ట్లెరుగబడుదు,
రెవ్వని యొడిగట్ట నీ తారలన్నియు
మల్లెమొగ్గలరీతి గిల్లబడును,
యెవ్వని కనుదృష్టి కీ భూమి గోళంబు
నరసావగింజతో సాటిపడును

తే॥గీ॥ యెవని మిాగాళ్ళ బంటి రావీయగాధ,
వార్ధి నీరములటువంటి వర బలాఢ్య,
డెవడో యాతడెనా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు

3. పరమండలము వసుంధర మండలము బట్టి
బంతులట్లాడించు ప్రబలుడెవడు,
పగటెండ రేయెండ పొన్పులట్లుగ చుట్ట
బెట్టి వేరొకచోట బెట్టునెవడు,
సర్వ జీవాధార సంచార పవనంబు
లొక, ముష్టిలో బట్టు నొడయ డెవడు,
హిమ, తపో వర్షకాలముల మూలలనుంచి
యెత్తి యుద్యోగంబు లిచ్చునెవడు;

తే॥గీ॥ తనకు దానె సమాన సౌందర్య సర్వ,
శక్తి విజ్ఞాన, సత్కృపా, శాంతమూర్తి
యెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

4. పరమదూతల మోక్షపురమను దెవ్వనికంట
పరిశుద్ధముగ చూడ గొరత దోంచు,
సత్య ప్రియాధిక సంతోషముల మిాద
నెవని సింహాసనం బెలమినుండు,
సకల జీవుల భక్ష్య సామగ్రులెల్ల నె
వ్వని చేతి దానంబులనుదినంబు,
సకలార్థ శబ్ద వాచకములన్నియు గూడి
యెవని పేర్కొనియాడ నెరుగలేవు,

తే॥గీ॥ ఎవ్వరే కాలమున కంటి కింపుతోడ,
జూడగోరిన తనరూపు జూపకుండు,
నెవడో, యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కునా కనుదినంబు

5. అఖల లోకముల వృత్తాంత మాద్యంతంబు
ఎవ్వని పటమునం దిమిడి యుండు,
సకలాంతరాత్మల సాక్షియై యెనడు కా
రణ కార్యభావనల్ గణనసేయు,
జీవ నిర్జీవ సైన్యావళిలో చిన్న
పురువైన తృణమైన మరువ డెవడు,
తగ భవిష్యద్భూత తత్కాలముల నేలు
చొక రీతిగల నీతి నుండు నెవడు,

తే॥గీ॥ తండ్రి తనయుండు విమలాత్మ తానె యగుచు,
నాణెముగ దీన భక్త బృందముల బ్రోచు
నెవడొ యాతడె నా తండ్రి యిష్ఠుడైన,
గనుడగు యెహూవ దిక్కునా కనుదినంబు

కం॥ వెలలేని పంచచామర
ములు మరియును పంచరత్నములు ప్రభువు కృపన్
ఇల చౌధరి పురుషోత్తము
వలన రచితమయ్యె సాదువర్గంబలరన్

కం॥ దేవుని యాశీర్వాదము
కేవలుడగు ప్రభువు యేసు క్రీస్తుని కృపయున్
ఆ విమలాత్మ సహాయం
బీవర గ్రంథంబుతోడ నెడపక యుండున్